ప్రజాశక్తి

మంగళవారం 3 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వినతుల వెల్లువ

- పిజిఆర్ఎస్‌కు పెరుగుతున్న తాకిడి
- కాపులుప్పాడలో 350 ఎకరాలను వియంఆర్‌డిఎ అమ్మేసే యత్నమంటూ రైతుల ఫిర్యాదు
- పింఛన్లు మంజూరు చేయాలని పలువురు వేడుకోలు
- సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. బాధితుల గోడును కలెక్టర్ డాక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విన్నారు. వారి సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు. గరిష్టంగా 24 గంటల్లోనే సమస్య తీరిపోయేలా చర్యలుండాలని దిశానిర్దేశం చేశారు. మొత్తంగా 253 ఫిర్యాదులు రాగా వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 93 ఉన్నాయి. తర్వాత స్థానంలో జివిఎంసికి చెందినవి 77 ఉన్నాయి. పోలీస్ విభాగానికి సంబంధించి 21, మిగతా శాఖలకు చెందినవి 62 ఉన్నాయి. గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇంచుమించు గ్రీవెన్స్‌లో ఈ తీరునే ఫిర్యాదులు మొత్తంగా 237 వచ్చాయి. వాటిలో రెవెన్యూ 94, జివిఎంసి 64, పోలీస్ 21 ఉన్నాయి. ఇతర విభాగాలకు 58 వినతులు వచ్చాయి. అత్యధికంగా భూ కబ్జాలపైనే వినతులు రావడంతో అధికార యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారింది.

ల్యాండ్ పూలింగ్ భూములు ఇప్పించాలి : కాపులుప్పాడ రైతులు

గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములను తీసుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించాలని కోరుతూ కాపులుప్పాడ రైతులు పలువురు కలెక్టరేట్‌కు సోమవారం విచ్చేశారు. రైతుల తరపున ఎవిఎస్.రామారావు 'ప్రజాశక్తి' ఎదుట తమ గోడు చెప్పుకుంటూ కాపులుప్పాడలో 165 మంది రైతుల నుంచి 350 ఎకరాల భూములను తీసుకున్నారన్నారు. నాలుగు స్థలాల్లో ఈ భూమి ఉందని, నష్టపరిహారంతో పాటు రైతులకు వేరే చోట భూమికి భూమి ఇస్తామని చెప్పారని తెలిపారు. తాజాగా కూటమి ప్రభుత్వం, వియంఆర్‌డిఎ అధికారులు ఈ భూములను అమ్మేసే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆందోళన తమలో ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మిగతా 2లో..

భూ లూటీపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాపులుప్పాడ రైతులు

వార్త 2లో..

ప్రమాణ స్వీకారం చేస్తున్న కోన తాతారావు

అట్టహాసంగా డిసిసిబి చైర్మన్

కోన తాతారావు ప్రమాణ స్వీకారం

ఆ ఊరికి వెలుగొచ్చింది!

- ఫలించిన సిపిఎం పోరాటం
- జీలుగులోవకు విద్యుత్ సౌకర్యం
- సంబరపడుతున్న ఆదివాసీలు

వార్త 7లో..

అక్రమంగా తరలుతున్న

రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలుతున్న 2500 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. సోమవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో మద్దిలపాలెం సమీపంలోని ఆటోమోటివ్ వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి పౌర సరఫరాల శాఖ సర్కిల్ - 2 సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ పి.మణికంఠ, ఎంవిపి సబ్ ఇన్‌స్పెక్టర్ జి.ధనుంజయ నాయుడు తనిఖీలు చేశారు. 50 పిడిఎస్ బియ్యం బస్తాలు వారికి లభ్యమయ్యాయి. అనంతరం వాహన డ్రైవర్ మాడుగుల మోహన్ కుమార్‌ను విచారించగా వన్ టౌన్ ప్రాంతానికి చెందిన వడిసెల సన్ని ఆఫ్టింగ్ డ్రైవర్‌గా తనను పిలిచి కృష్ణా కాలేజ్ సమీపంలోని కొన్ని ఇళ్ల నుండి ఈ బియ్యాన్ని సేకరించవలసిందిగా సూచించాడని తెలిపాడు. కేసు దర్యాప్తులో ఉంది.



మొదటి పేజీ తరువాయి..

వినతుల వెల్లువ

ఈ ప్రక్రియను ఆపేసి భూములను రైతులకు ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

తహశీల్దార్‌తో కుమ్మక్కై 66 సెంట్ల భూమి కాజేతపై ఫిర్యాదు

భీమునిపట్నం తహశీల్దార్‌తో కుమ్మ క్కయి మొక్క శ్రీను అనే వ్యక్తి 2020లో ఆన్‌లైన్‌లో 66 సెంట్ల తమ భూమిని గుంజుకుని అనుభవిస్తున్నాడని సంగివలసకు చెందిన బాధితురాలు సిహెచ్.విజయలక్ష్మి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1967లో అత్త, మామ సంగివలసలో 66 సెంట్ల భూమిని కొనుక్కున్నారని, తమ మామకు ఇద్దరు కొడుకులని, 2020లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌లో చేసుకున్నారని ఆమె వివరించారు. 2023లో మొక్క శ్రీను అనే వ్యక్తి బుల్డోజర్, రౌడీలను తీసుకొచ్చి చదును చేసేసి లాక్కొనే ప్రయత్నం చేశాడని ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

పెన్షన్ ఇప్పించరూ..

నగరంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన తన భర్త దివ్యనంద్‌కు పదేళ్ల క్రితం పెరాలసిస్ వచ్చి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయని, అంతవరకూ ఆటో తొక్కుతూ కుటుంబాన్ని సాకారని, ప్రస్తుత పరిస్థితిలో పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అతని భార్య రెడ్ల భూ లక్ష్మి వేడుకున్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ మంజూరైనప్పటికీ ఇంకా చేతికి అందలేదన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని ప్రారంభించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతాడ జోగారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. పేద విద్యార్థుల కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ పథకంతో ఎంతోమంది దళిత, బడుగు, బలహీన తరగతుల పేదవారు చదువుకున్నారన్నారు. సుప్రీం కోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ కార్పొరేట్ పాఠశాలలు అమలు చేయడం లేదని, ఫీజులు చెల్లించాలంటూ టిసిలు ఇవ్వకుండా భాష్యం వంటి పాఠశాలలు నగరంలో భీష్మించుకు కూర్చొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేద విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరై వినతిపత్రం అందజేశారు. పిజిఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ భవానీ శంకర్, జివిఎంసి ఎడిసి (ఫైనాన్స్) వర్మ, తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసికి 57 వినతులు

ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు జివిఎంసి పరిధిలో 57 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు డివి.రమణమూర్తితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

అట్టహాసంగా డిసిసిబి చైర్మన్ కోన తాతారావు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మద్రిపాలెంలోని బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ తాతారావుచే బ్యాంకు సిఈవో డివిఎస్ వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపి సి.ఎం.రమేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, విఎంఆర్‌డిఎ చైర్మన్ వి. ప్రణవ్‌గోపాల్ తదితరులు హాజరై నూతన చైర్మన్ కోన తాతారావును అభినందించారు.

బ్యాంకు అభివృద్ధి, రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధి, రైతుల సంక్షేమం ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావు అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా రైతుల జీవన ప్రమాణాలను పెంచడానికి ప్రణాళికను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. నాబార్డ్, ఆప్కాబ్ నుంచి అధిక నిధులను తమ బ్యాంకుకు తీసుకు రావడానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు టర్నోవర్ రూ.2400 కోట్ల నుంచి రూ. 3 వేల కోట్లకు పెంచేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రయత్నిస్తానన్నారు.

కులధ్రువీకరణ పత్రాల పేరుతో వేధింపులు సరికావు

విశాఖ కలెక్టరేట్ : కులధ్రువీకరణ పత్రాల పేరుతో ఎస్‌టి అధికారులను, పెన్షనర్లను బిఎస్‌ఎన్‌ఎల్ మహారాష్ట్ర సర్కిల్‌లో వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ, సోమవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్‌ఎన్‌ఎల్ జిఎంటిడి కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన తెలిపారు. ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐబి డిపిఎ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.ఈ.సిహెచ్.వి సాగర్ మాట్లాడుతూ ఎఐబి డిపిఎ, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చాలా సంవత్సరాలుగా బిఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యం కులధ్రువీకరణ పత్రాల పేరుతో ఎస్టీ అధికారులను,పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. డిఒపి, టిసూచనలను, డాట్ ఆదేశాలను బిఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యం ఉల్లంఘిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా బిఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యం పదవీ విరమణ చేసిన ఎస్‌టీ అధికారులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎ.ఎ.అశ్రఫ్, ఎస్.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో అవినీతి

తక్షణం విచారణ చేపట్టండి

- మేయర్‌ను కోరిన సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, అధికార కూటమి ప్రజాప్రతినిధుల చీకటి వ్యాపారంపై విచారణ జరపాలని, అందుకు ఫ్లోర్ లీడర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సోమవారం ఉదయం పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దీర్ఘ కాలంగా నగరంలో కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ అండతో తీవ్ర అనైతిక, ప్రమాదకర అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. వ్యర్థాలను నిబంధనల ప్రకారం కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉన్నా, దాన్ని ఉల్లంఘించి అక్రమంగా చేపల చెరువులకు తరలించి కోట్ల రూపాయలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యర్థాలు వినియోగించిన చేపల చెరువుల్లోని చేపలు తిన్న ప్రజలు కేన్సర్, కిడ్నీ, లివర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. ఈ అనైతిక కుంభకోణంలో కొంతమంది తెలుగుదేశం, జనసేన అధికార కూటమి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉన్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయన్నారు. లక్షల రూపాయలు ప్రతి నెలా అక్రమంగా ఈ ముఠా నుంచి ముడుపులు పొందుతున్నారని తెలుస్తోందన్నారు. కొంతమంది అధికార పార్టీ కార్పొరేటర్లు, ఎంఎల్‌ఎలే ఈ చీకటి వ్యాపారానికి ప్రధాన పాత్రదారులు కావటం అత్యంత ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజలను నిలువునా బలిదీసుకునే ఇటువంటి చీకటి కార్యకలాపాలను అరికట్టాల్సిన ప్రజాప్రతినిధులే బినామీలుగా ఉండి కోట్ల రూపాయల ఈ చీకటి వ్యాపారాన్ని నడపటం తీవ్ర నేరమని పేర్కొన్నారు. ఈ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టి వారితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దుచేయాలని కోరారు.

విశ్వనాథం మాస్టారుకు పురస్కారం

విశ్వనాథం మాస్టారుకు పురస్కారం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ హైస్కూల్లో పనిచేసిన హిందీ మాస్టారు యర్ర విశ్వనాథంకు విద్య, సామాజిక రంగంలో విశిష్ట సేవలకుగాను ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తీర ప్రాంత ఎక్స్‌ప్రెస్ పత్రిక తరుపున ఉగాది - 2025 పురస్కారాన్ని సోమవారం సాయంత్రం అందజేశారు. విశాఖ నగరంలోని మద్రిపాలెంలోగల మాస్టారి స్వగృహానికి వారంతా తరలివచ్చారు. కార్యక్రమం నిర్వాహకులు, బారువ హైస్కూల్ పూర్వ విద్యార్థి, తీర ప్రాంత ఎక్స్‌ప్రెస్ స్టేట్ బ్యూరో చీఫ్ దున్న భాస్కర్‌రావు ఉగాది పురస్కారాన్ని మాస్టారుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనల వాసుదేవరావు, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.రామకృష్ణ, డి.సింహాద్రి, కొత్తపల్లి జోత్స్న, కొత్తపల్లి హారిక, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, టి.లోకనాథం, టి.గురుమూర్తి, బారువ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాధవధారలోని తమ ఇంటిని ఆనుకుని ఉన్న 120 గజాల స్థలంలో బిల్డర్ గ్రూప్‌హౌస్ నిర్మిస్తున్నారని, అందులో తమకు చెందిన స్థలాన్ని కూడా ఆక్రమించి,సెట్‌బాక్స్ ఏమి వదలకుండానే నిర్మాణం చేస్తున్న విషయంపై కలెక్టర్‌కు మూల సన్యాసిరావు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనధికార నిర్మాణంపై ఇదివరకే జివిఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. బిల్డర్‌ని ప్రశ్నించానని, జివిఎంసి, సచివాలయం సిబ్బంది సహాయం తనకు ఉందని సమాధానం ఇచ్చాడన్నారు.

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :గంగవరం ఆదాని పోర్ట్ యాజమాన్యం నిర్వాసితులు ఒక్కొక్క కుటుంబానికి బకాయి ఉన్న రూ.27లక్షలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, సోమవారం గంగవరం అదాని పోర్ట్ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘ సభ్యులు గంటిపల్లి అమ్మోరు, నొల్లి తాతారావు తదితరులు మీడియాతో మాట్లాడారు.

ఘరానా మోసగాడు అప్పలరాజును అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఇళ్లు కట్టిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేసి, మోసగించి పరారైన పాల వెంకట అప్పలరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ జోన్ నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇళ్లు కట్టిస్తామని చెప్పి సుమారు రూ.3 కోట్లు వసూలు చేసి అప్పలరాజు పరారయ్యాడన్నారు. రామ్‌నగర్‌కు చెందిన ఈ ఘరానా మోసగాని వ్యవహారంపై బాధితులు త్రీ టౌన్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. నిందితులను దాచిపెట్టిన అప్పలరాజు కుటుంబ సభ్యులపై కూడా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION)
AT: VISAKHAPATNAM
E.A.11/2025 in E.P.67/2023 in O.S.1233/2021

Between:
Alagala Emmanuel Deva Prasad ...Petitioner/J.Dr
And:
K.M.V.N. Swamy ...Respondent/D.Hr

NOTICE

To,**Respondent/D.Hr:**
Sri Koidala Mahaveera Nanda Swamy
S/o. Late Suryanarayana,
Aged 55 years,
R/at D.No.44-35-23,
Srinivasa Nagar, Akkayyapalem,
Visakhapatnam-530016.

Take notice that the above petition filed by the above petitioner/J.Dr under rule 232 to 235 of Civil Rules of practice in which the Hon'ble Court Ordered notice to you. Therefore, you are hereby summoned to appear in the above Court, in person or through an Advocate duly instructed and able to answer all material questions relating to the above matter on **16-06-2025** at **10:30 A.M.**, in default of your appearance on that day, the matter will be determined in your absence.

(By Order of the Hon'ble Court)
V. SRIDHAR
CH. HARIBABU,
Advocates, Visakhapatnam.
Cell: 9949164686, 9700647391.

రిక.నెం.773/2025/ఎ
తేది: 31-05-2025

తహాశీల్దార్ వారి కార్యాలయము
గోపాలపట్నం మండలం

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తుడు, శ్రీ బొత్స కేశవరావు తండ్రి బి.రామినాయుడు (లేటు), ఇంటి నెం. 39-2-24, మురళీనగర్ ఈస్ట్, విశాఖపట్నం నందు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నెంబర్	విస్తీర్ణము
ఇంటి నెం. 39-2-24, కప్పరాడ గ్రామం	10/2A భాగం	140 చ.గజాలు

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలెక్టర్ మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహాశీల్దారు, గోపాలపట్నం వారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలసిందిగా కోరడమైనది.

తహాశీల్దార్
గోపాలపట్నం మండలం, విశాఖపట్నం

IN THE COURT OF THE HON'BLE V ADDLDISTRICT JUDGE
RANGA REDDY DISTRICT
AT :: L.B. NAGAR
I.A.No. 139 of 2025
IN
O.S No. 746 of 2018

Between:
Smt. K. Manasa Bai & others
Rep by their GPA holder
...Petitioners/Plaintiffs
AND
Sri Rajesh Singh & others.
...Respondents/Defendants

To,
Smt. Rupa Katari, D/o. Sri. Katari Kodapa Rao, Aged about 43 years, Occ: Software Profession, R/o. H.No. 19-628, Chodavaram, Kota Street, Chodavaram Mandalam, Visakapatnam, A.P-531036. **(R-46)**

Take notice that above named Petitioner/Plaintiff filed the above I.A. No. 139 of 2025 under order I Rule 10 to implead the above respondent as defendant in the main suit. The above said I. A is stand posted to 23.06.2025 for your counter if any. Therefore, you are directed to appear in person or through advocates on **23.06.2025.** Otherwise, the matter will be decided in your absence by setting you ex-parte.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s. M.MEHBOOB ALI,
Advocate
Counsel for the Petitioner/Plaintiff.
Add : # 8-4-549/217, Plot No.206/43, Netaji Nagar, Erragadda, Hyderabad-500018
Mobile No.+91 9700433363

ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవి సెలవులు అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి, రెండో ఏడాది తరగతులు ప్రారంభమయ్యాయి. టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు నూతనో త్సాహంతో మొదటి ఏడాది తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, కాలేజీ బ్యాగ్‌లతో కూడిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపల్ పి.రామ్ ప్రసాద్ అందజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు భోజనం అందించారు.

'వైసిపి నిరసనలకు పిలుపివ్వడం హాస్యాస్పదం'

ప్రజాశక్తి -భీమునిపట్నం : వెన్నుపోటు దినం పేరిట వైసిపి ఈ నెల 4వ తేదీన నిరసనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్నటి సాధారణ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు వైసిపి గత ఐదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలకు చెంప పెట్టు అని విమర్శించారు. ఘోర ఓటమికి కారణాలను విశ్లేషించి, ప్రజా తీర్పును గౌరవించాల్సింది పోయి వెన్నుపోటు దినం అంటూ నిరసనలకు పిలుపు నివ్వడం ఆశ్చర్యం వేస్తుందన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి అందించిన పైలెట్ ప్రాజెక్టుకు విద్యుత్ లేక నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో సుమారు 20 గ్రామాల్లో దాహం దాహం కేకలు వినిపిస్తున్నాయి. పద్మనాభం పంచాయతీ పరిధి ఇసుకలపాలెం గ్రామంలో ఉన్న పైలెట్ ప్రాజెక్టు మే 30వ తేదీ నుంచి పనిచేయకపోవడంతో గంధవరం, పల్లి, బి.హెచ్.పురం, మద్ది, రెడ్డిపల్లి, తునివలస, నేరెళ్లవలస, కొయ్యిపేట, నరసాపురం గ్రామాలకు నీటి సరఫరా కావడంలేదు. గోస్తనీ నది పరివాహక తీరంలో ఏర్పాటుచేసిన పైలెట్ ప్రాజెక్టుకు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో నీటి సరఫరా ఆగిపోయింది. పద్మనాభం గ్రామంలో గ్రామ దేవత బంగారమ్మ పండగ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కావడం, నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -భీమునిపట్నం : పనిచేసిన కాలానికి బకాయి పడ్డ కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి, మధుర వాడ జోన్ కమిటీల ఆధ్వర్యాన సోమవారం స్థానిక అడిశా అపార్ట్‌మెంట్ ఎదుట బాధిత భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 2023లో అపార్ట్‌మెంట్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి 2024 ఆగస్టులో పూర్తి చేయగా, అప్పటి నుంచి బకాయి ఉన్న దాదాపు రూ.1.25 లక్షలు నేటికీ కార్మికులకు చెల్లించలేదని తెలిపారు. బకాయి లు ఇవ్వలేదు సరికదా సబ్ కాంట్రాక్టర్ లక్ష్మణ రావుకు చెందిన పరంజాకు సంబంధించి కర్రలు, ఇతర నిర్మాణ సామగ్రిని కూడా సంబంధిత యాజమాన్యం అప్పగించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు, ఉపాధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మధురవాడ జోన్ కమిటీ అధ్యక్షులు ఆవాల లక్ష్మణరావు, కార్యదర్శి ఎం.సత్యం, సహాయ కార్యదర్శి కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సైబర్ సెక్యూరిటీపై గీతంలో ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : సైబర్ ముప్పులను ఎదుర్కొనే పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ (సి-డాక్) సంస్థ సంయుక్తంగా సోమవారం సైబర్ సెక్యూరిటీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) నిర్వహించారు. సి-డాక్ కేంద్రం అధిపతి డాక్టర్ సిహెచ్ఎవిఎస్.మూర్తి, ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు డాక్టర్ శరత్‌చంద్ర బాబు ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా హాజరై విద్యాసంస్థలు సైబర్ భద్రతా సిద్ధత, మానవ వనరుల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం ఉన్న భద్రతా లోపాలు, కృత్రిమ మేధ ఆధారిత సైబర్ ముప్పులు, డిజిటల్ మౌలిక సదుపాయాల భద్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. జాతీయ ఇఎస్ఇఎ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవగాహన) ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ కార్యక్రమంలో మారుతున్న సైబర్ ముప్పుల దృష్ట్యా విద్యాసంస్థల్లో నైపుణ్యం గల మానవ వనరులను తయారు చేయడం లక్ష్యంగా ఇఎస్ఇఎ కృషి చేస్తోందని వెల్లడించారు.

గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎస్.అరుణ్‌కుమార్ డిజిటల్ భద్రత పెంపునకు, సైబర్ సెక్యూరిటీలో అకడమిక్-ఇండస్ట్రీ సహకారాన్ని బలపర్చడంలో గీతం చేస్తున్న కృషిని వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, అధ్యాపకులకు శిక్షణ ద్వారా అకడమిక్ మెరుగుదలతో పాటు రాబోయే సైబర్ సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం గల మానవ వనరులను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.లక్ష్మేశ్వరి, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ విక్రమ్‌ధీమాన్

కేర్‌లో వంద రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేర్ ఆసుపత్రిలో విజయవంతంగా వంద రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలు పూర్తిచేసినట్టు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ, 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసుకోవడం తమ వైద్య బృందానికి గర్వకారణం అన్నారు. ఆసుపత్రి సిఒఒ మయూక్ చౌదరి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో రోబోటిక్ శస్త్ర చికిత్సల కేంద్రంగా కేర్ ఆసుపత్రి ఎదుగుతుందన్నారు. కేర్ ఆసుపత్రిలో కేవలం మోకాలి మార్పిడి కాకుండా రోబోటిక్ సహాయంతో నడుం, వెన్నెముక శస్త్ర చికిత్సలు కూడా విజయవంతంగా చేస్తున్నామని తెలిపారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సిపిఐ ధర్నా

గాజువాక తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన పలుచోట్ల సోమవారం ధర్నాలు నిర్వహించారు.

గాజువాక : సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని హామీ ఇచ్చిందని, ఏడాది గడుస్తున్నా హామీని నిలబెట్టు కోలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కిచ్చిన హామీలన్నింటినీ అమలుచేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం గాజువాక డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసరావుకు సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పిల్లా పద్మ, పెదపూడి దుర్గారావు, పల్లేటి పోలయ్య, చంద్రశేఖర్, శివ, గణేష్ పాల్గొన్నారు.

ఆరిలోవ : సిపిఐ ఆరిలోవ, మధురవాడ శాఖల ఆధ్వర్యాన విశాఖ రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎమ్‌డి.బేగం, ఎ.దేముడమ్మ, కె.లక్ష్మణరావు, సిహెచ్.కాసుబాబు, కె.సందీప్, ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న పేద ప్రజలు పాల్గొన్నారు.

ములగాడ : ములగాడ మండల కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. టిడ్కో ఇళ్లను అప్పగించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ, గుడాల రాంబాబు, గండి అప్పారావు, శేఖర్ శ్రీనివాస్, డి.గోపి, గుడాల జయ, గండి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : అర్హులందరికీ ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఏరియా సమితి సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ, ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆదినారాయణ, గోవిందరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం టర్నర్ చౌల్ట్రీలోని మహారాణిపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు మాట్లాడారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీసుస్టేషన్ పరిధిలో బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్కాపురం ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి ప్రాంతానికి చెందిన రామ్మూర్తి (38), నారాయణరావు (32) తాపీ మేస్త్రిలుగా పనులు చేస్తుంటారు. వీరు అనకాపల్లి నుంచి గాజువాక మీదుగా మల్కాపురం వైపు వెళు తుండగా మధ్యలో హెచ్‌పిసిఎల్ గేటు స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు వీరు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్మూర్తికి కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన నారాయణరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు వివరాలను సేకరించి, మృతుని కుటుంబానికి సమాచారం అందించారు. మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యాన కేసు నమోదుచేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూ కాలనీ తాటిచెట్లపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేపట్టారు. రైల్వే న్యూ కాలనీ వద్ద 1500 కేజీల బియ్యంతో వస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాక మండలం గొల్ల జగ్గరాజుపేటలో చెట్టుకు ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వయసు 30 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే దువ్వాడ సిఐ (9440796053)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఎసిపి మన్మధరావు తెలిపారు. క్రైం పోలీసుల కథనం ప్రకారం... పైడిమాంబ కాలనీకి చెందిన చేపల ఆనంద్ (24), గంగవరానికి చెందిన కంబాల శ్రీరాజు (22) కలిసి ఈనెల 26వ తేదీ రాత్రి గాజువాకలో నివాసముంటున్న ఉరుకూటి నూకాలమ్మ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. నూకాలమ్మ మెడలోని బంగారు గొలుసును దొంగలించారు. ఈ దొంగతనంపై నూకాలమ్మ పోలీసులను ఫిర్యాదు చేశారు. గాజువాక పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి బంగారు గొలుసు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ పాత నేరస్తులని, వీరిపై సస్పెక్ట్ సీట్ ఓపెన్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : హాస్టల్‌లో చేర్పిస్తామని తల్లిదండ్రులు చెబుతుండడంతో మనస్తాపం చెందిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో కార్పొరేటర్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తికి కుమారుడు, ఏడో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం బాలిక తండ్రి విధులకు, తల్లి ఓ వేడుక నిమిత్తం ఆనందపురం, అన్నయ్య స్నేహితుల వద్దకు వెళ్లిపోయారు. సాయంత్రం అందరూ తిరిగొచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా బాలిక ఆత్మహత్యకు పాల్పడి కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో చేరడం ఇష్టం లేకనే బాలిక ఇలా ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పిల్లలకు నీతి కథలు

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం కొన్ని నీతి కథలను చెప్పారు. నీతి, నిజాయితీలతో జీవించడం వల్ల మనిషి నిర్భయంగా, స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించగలడని యువజన నాయకులు చింతకాయల వెంకటరమణ పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త ఎమ్. నాగబాబు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, సునీత, పాల్గొన్నారు.

గెడ్డల్లో పూడికలు తొలగించండి

- మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఉక్కునగరం, ఎంవిపి.కాలనీ : వర్షాలు పొంచి ఉన్నందున జివిఎంసి పరిధిలో గల ప్రధాన గెడ్డలు, కాలువలు పొంగిపొర్లకుండా వెంటనే పూడికలను తొలగించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఆయన జోన్-6లోని 87, 88, జోన్-3లోని 18, 19 వార్డులలో వార్డు కార్పొరేటర్లు బొండా జగన్నాథం, మొల్లి ముత్యాలు, గొలగాని మంగవేణి, నొల్లి నూకరత్న, జోనల్ కమిషనర్లు బిఆర్ఎస్.శేషాద్రి, కె.శివప్రసాద్‌లతో కలిసి ఆయా వార్డుల్లో పర్యటించారు.

ముందుగా 87వ వార్డులో కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి ఎన్‌టిఆర్ కాలనీ వద్ద ప్రధాన గెడ్డలో పూడికతీత పనులను పారిశుధ్య కార్మికులతో ఎందుకు చేయిస్తున్నారని ఆరా తీశారు. కాంట్రాక్టర్ వర్కర్లతో పని చేయించకపోవడంపై కాంట్రాక్టర్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు గుడులు వద్ద వాసవి హాస్పిటల్ ప్రాంతంలో ప్రధాన గెడ్డ పూడిక తీత పనులను పరిశీలించి ఇరువైపులా కుప్పలుగా ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఎంవి వి-ఎం కె పార్క్ అపార్ట్‌మెంట్ నుంచి వస్తున్న మురుగునీరు

87వ వార్డులో గెడ్డను పరిశీలిస్తున్న మేయర్

కాలువలోనికి నేరుగా వస్తున్నందున వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాటును వారు చేసుకోవాలని, మురుగు నీటిని కాలువలోనికి విడుదల చేయవద్దని నోటీసులు జారీచేయాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్‌కుమార్‌కు మేయర్ ఆదేశించారు. అదే కాలువపై అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని ఎసిపి వెంకట్రావుకు ఆదేశించారు.

88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలుతో కలిసి దువ్వాడ సెక్టర్ 1 సంధ్యానగర్ ప్రవేశ ద్వారం వద్ద, సంపత్ వినాయకనగర్ వద్ద ప్రధాన గెడ్డలలో పూడిక తీతలను పరిశీలించారు. సంధ్యానగర్ రోడ్డుపై కల్వర్టు చిన్నదిగా ఉన్నందున బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావును ఆదేశించారు.

జోన్ -3 పరిధి 18వ వార్డులో కార్పొరేటర్ గొలగాని మంగవేణితో కలిసి అప్పుఘర్ ఎదురుగా ఉన్న నివాసిత కాలనీలో కాలువలు, రోడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. కైలాసగిరి రోప్‌వే ఎదురుగా బీచ్‌లో నిర్మాణ, ఇతర వ్యర్థాలు అధికంగా ఎందుకున్నాయని ప్రశ్నించారు. వాటిని వెంటనే తొలగించాలని, ఇతర వాహనాలు రాకుండా, నిర్మాణ వ్యర్థాలు పడవేయకుండా బీచ్ ప్రవేశ ద్వారానికి ఒక పటిష్టమైన గేట్‌ను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజును మేయర్ ఆదేశించారు. అనంతరం 19వ వార్డులో నొల్లి నూకరత్నతో కలిసి లాసెన్స్ బే కాలనీ రోడ్డులోని ప్రధాన గెడ్డ పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, తన పదవీకాలంలో నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ విశాఖ నగర అభివృద్ధి ధ్యేయంగా నిత్యం కృషి చేస్తానని, అందుకు అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ సహకరించాలని మేయర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాస్ ప్రసాద్, అప్పారావు, గంగాధర్, ఎసిపి వెంకట్రావు, హార్టికల్చర్ ఆఫీసర్ అర్చన, ఉప కార్య నిర్వాహక ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

క్రీడా హబ్‌గా గాజువాక : ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -గాజువాక : క్రీడా హబ్‌గా గాజువాకను తీర్చిదిద్దుతామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. జివిఎంసి 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో రూ.9 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన ఇండోర్ స్టేడియం, ఈత కొలను, ఓపెన్ ఆడిటోరియమ్‌లను స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశాఖ నగరంలో గాజువాక ప్రాంతానికి ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడాకారులకు అనువైన వేదికగా ఈ స్టేడియం నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాజువాకలో మరో 8 క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ అంతర్జాతీయ క్రీడలకు గాజువాక వేదిక కావాలని ఆకాంక్షించారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. కౌన్సిల్‌లో ప్రతిపాదించిన వెంటనే నిధులు కేటాయించామని తెలిపారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి, గాజువాక ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, లేళ్ల కోటేశ్వరరావు, రాజాన రామారావు, బట్టు సూర్య కుమారి, జోనల్ కమిషనర్ శేషాద్రి, పుచ్చా విజయ్ కుమార్, తిప్పల రమణారెడ్డి, రట్టి వాసు, బైపిల్లి గాంధీ, గోమాడ వాసు, కృష్ణ, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, నాగేశ్వరరావు, స్వరూపా రాణి, మంగ పాల్గొన్నారు.

ఎన్‌సిఆర్‌సి ఉపాధ్యక్షునిగా ఉత్తర్వులు అందుకుంటున్న దాడి

ఎన్‌సిఆర్‌సి ఉపాధ్యక్షునిగా దాడి

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్‌సిఆర్‌సి) ఉపాధ్యక్షునిగా దాడి సత్యనారాయణ నియమితులయ్యారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యాన విశాఖపట్నంలోని సింధూర ఫంక్షన్ హాల్‌లో వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో విశాఖ డిప్యూటీ మేయర్‌గా సేవలందించిన దాడి సత్యనారాయణను జాతీయ ఉపాధ్యక్షునిగా నియమిస్తూ ఎన్‌సిఆర్‌సి జాతీయ స్థాయి వ్యవస్థాపక చైర్మన్ ఎంవిఎల్ నాగేశ్వరరావు నియామక పత్రాన్ని అందజేశారు. విశాఖ జిల్లాలోని 30 మంది సభ్యులకు వివిధ పదవుల్లో నియమించినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రసాద్, బల్ల శ్రీనివాస్, అవినాష్, నైడాన ప్రసాద్, సాయి శ్రీనివాస్, టి.రాము, సూర్యప్రకాష్, మల్లవరపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై జింకలు

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై జూ పార్క్ బ్యాటినికల్ పార్క్ మధ్యలో సోమవారం మూడు జింకలు రోడ్డుపైకి వచ్చాయి. వాటిని వాహనదారులు వీడియో తీశారు. అనంతరం వాటిని అడవిలోకి పంపించే చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులు స్పందించి జింకలు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో కొన్ని చోట్ల జింకలు జాతీయ రహదారిపై ప్రమాదానికి గురై మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.

గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వికె.పాలెం, మద్ది, కోరాడ గ్రామాల్లో సోమవారం కొండేంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెంకటాచలం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన సాంకేతిక, ప్రభుత్వ పథకాల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామినాయుడు, కె.వెంకటసత్యనారాయణ, కె.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ సమీపంలోని కారు షెడ్డు జంక్షన్‌లో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను భవన యజమాని కొవ్వూరి పుండరీకాక్షరెడ్డి సోమవారం ప్రారంభించారు. మొదటగా వస్తువులను జామి భోజరాజు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ, మధురవాడ పరిసర ప్రాంతాలవారికి అనువుగా, మెయిన్ రోడ్డుకు దగ్గరగా షోరూమ్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విన్నూతమైన కలక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ల బంగారు ఆభరణాలును క్యాష్, యుపిఐ, ఈ ట్రాన్స్‌ఫర్ల ద్వారా ఫ్లాట్ 6 శాతం తరుగుకే ఆభరణాలను పొందవచ్చని వివరించారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జిఎస్‌టిని తామే చెల్లిస్తామని తెలిపారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.12 వేలు వరకు తగ్గింపు ఇస్తున్నామని, ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ షోరూమ్‌కు వచ్చి ప్రత్యేకమైన డిజైనరీ కలక్షన్లను ఎంపిక చేసుకొని ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పుండరీకాక్షరెడ్డి

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ లీలావతి శ్రీనివాసరావు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జివిఎంసి నిధులు రూ.19 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న జడ్జి

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలం నృసింహస్వామిని సోమవారం గుజరాత్ హైకోర్టు జడ్జి సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు, ప్రధాన అర్చకులు నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని, తదుపరి బేడా మండపం ప్రదక్షిణ చేపట్టారు. స్వామి దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనము ఇచ్చారు. స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ఆలయ కార్యనిర్వాహణాధికారి స్వామివారి ప్రసాదాలు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీవిశ్వ ప్రభంజనం

ప్రజాశక్తి -ఆనందపురం : జెఇఇ అడ్వాన్స్‌డ్ -2025 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి ప్రతిభను చాటారని కళాశాల చైర్మన్ కె.ధర్మరాజు తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థలైన ఐఐటి, ఎన్ఐటి, ట్రిబుల్ ఐటిలలో చేరేందుకు అర్హత పొందారని పేర్కొన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ధర్మరాజు ప్రకటించారు. బి.నవదీప్ రాజు (31), ఎ.తారక్‌రామ్ (151), ఎల్.హరికేశ్ (519), హెచ్.వెంకటహేమ వర్ధన్ (592), కె.బలరాం (706), బి.షణ్ముఖనాయుడు (765), యు.జయంత్‌కుమార్ (953), వై.రాజశేఖర్ (1522), డి.రవిరాజు (1917), పి.నితీష్‌కుమార్ (2396) ర్యాంకులు సాధించారని తెలిపారు. 1000 ర్యాంకుల లోపు 7 మంది, 5000 ర్యాంకు లోపు 30 మంది, 10000 ర్యాంకు లోపు 52 మంది మొత్తం 297 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో ప్రవేశానికి అర్హత సాధించారని వివరించారు.

ఈ సందర్భంగా కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు మాట్లాడుతూ, ఈ ఫలితాలు విద్యాసంస్థ విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఇది అధ్యాపక బృందం కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల అంకిత భావానికి ఫలితం' అని పేర్కొన్నారు. డైరెక్టర్ పి.సూర్యనారాయణ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

పాండ్రంగికి చెందిన తారక్ రామ్‌కు 151 ర్యాంకు

పద్మనాభ మండలం, పాండ్రంగి గ్రామానికి చెందిన అంజూరి తారక్‌రామ్ ఐఐటి అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 151వ ర్యాంకు సాధించాడు. తారక్‌రామ్ తల్లిదండ్రులు అంజూరి శ్రీను, ఉమ దంపతులు మత్స్యకార వృత్తిలో ఉంటూ కుమారుడ్ని చదువులో ప్రోత్సహించారు. తారక్‌రామ్ పదోతరగతిని సింహాచలం గురుకుల పాఠశాలలో చదివి 588 మార్కులు సాధించాడు. శ్రీవిశ్వలో ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. ఈ సందర్భంగా తారక్ రామ్‌ను శ్రీవిశ్వ అకాడమీ చైర్మన్ కె.ధర్మరాజు ప్రత్యేకంగా అభినందించారు.

అల్లూరి పార్కులో యోగాంధ్ర

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర అధికారులు

యోగాంధ్రలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-గొలుగొండ : నిత్యం యోగా సాధనతో ఆరోగ్యం బాగుంటుందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి పార్క్‌లో మెగా యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21న విశాఖలో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో నిర్వహించే యోగాదినోత్సవానికి సన్నాహకంగా జిల్లాలో నాలుగు మెగా ఈవెంట్లు నిర్వహించనున్నామని, అందులో భాగంగా కెడి.పేట అల్లూరి పార్క్‌లో తొలి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లాలో మాస్టర్ ట్రైనర్లకు ఇప్పటికే శిక్షణనిచ్చామని, వారు మండలాల్లో, గ్రామాలలో యోగ శిక్షణ అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని, దీనిద్వారా దీర్ఘకాలిక శారీరక రుగ్మతల నుంచి ఉపశమనంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ, జిల్లా టూరిజం అధికారి కె.మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, తహశీల్దార్ రామారామారావు, ఎంపిడిఒ మేరీరోజ్, సర్పంచ్ లోచల సుజాత, మాజీ జెడ్‌పిటిసి చిటికెల తారకవేణుగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, యోగా సాధకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలతో యోగాసనాలు వేయించిన సిడిపిఒ

నర్సీపట్నం టౌన్ : స్థానిక మాత శిశు సంరక్షణ కార్యాలయంలో సోమవారం యోగాంధ్రలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలతో సిడిపిఒ సువార్త యోగాసనాలు వేయించారు. స్వయంగా తాను యోగాసనాలు వేసి చూపించి, అలాగే వేయాలంటూ అంగన్వాడీలకు అవగాహన కల్పించి, వేసేలా ప్రోత్సాహించారు. శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, దాని ప్రయోజనాలను వివరించారు.

ప్రాణాయామంతో మానసిక ఒత్తిడికి చెక్

అనకాపల్లి : రోజూ ప్రాణాయామం, ధ్యానం చెయ్యడం వల్ల ప్రయాణాల్లో వచ్చే మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ డ్రైవర్ విధిగా రోజు యోగ చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్ అన్నారు. యోగాంధ్ర – 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటలకు జిల్లా రవాణా శాఖ సిబ్బంది, ఆటో, టాక్సీ డ్రైవర్లతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ గురువులు మంగియ్య, బి.అప్పారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎన్.రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ప్రకాష్‌రావు, రాజన్న, వెంకటరావు, పరిపాలన అధికారి బాల జ్యోతి పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గోర్లివానిపాలెం బసవతారకరామారావు నగర్‌లో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట స్థానికులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్‌వి.అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పరవాడ జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో 1500 ఇళ్లు, ఆ పక్కనే టిడ్కో ఇళ్లు మరో 512 ఉన్నాయని తెలిపారు. వీరందరికీ గతంలో ఎండియు వాహనం వీరి ఇళ్ల వద్దకే వచ్చి సరుకులు అందించేవారని, నేడు ఎండియు వ్యవస్థను రద్దు చేయడంతో వీరంతా గోర్లివానిపాలెం పంచాయతీలో పరిధిలో 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. అంత దూరం వెళ్లి పడికాపులు కాసినా రేషన్ దొరకలేని పరిస్థితి ఉందన్నారు. అందువల్ల బసవతారకరామారావు కాలనీలో ఈ మొత్తం 2వేల కుటుంబాలకు రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఏరియా కమిటీ ప్రెసిడెంట్ అమ్మ బంగారమ్మ, సెక్రటరీ అన్నపూర్ణ, కమిటీ సభ్యులు సంతోషి, అబద్ధం, కనకమాలక్ష్మి, రవణమ్మ, వరలక్ష్మి, మంగ, గోపాలరావు, లక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు

సమస్యల నుండి దృష్టి మళ్లించడానికే యోగాంధ్ర

ఎపి వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

యోగాంధ్ర పేరుతో చేస్తున్న హడావుడి అంతా సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికేనని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "యోగా ఉపాధి కూలీలు ఆకలి తీరుస్తుందా? రైతుల పంటకు మద్దతు ఇస్తుందా? కాంటాక్ట్ ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తుందా? నిరుద్యోగుల సమస్య పరిష్కారం చేస్తుందా? విద్యా వైద్యం మెరుగుపర్చుతుందా? మౌలిక సదుపాయాలు కల్పిస్తుందా? అధిక ధరలు తగ్గిస్తుందా? దళిత, గిరిజనులు సమస్యలు పరిష్కరిస్తుందా? విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపుతుందా? ఎపికి ప్రత్యేక హోదా వస్తుందా? ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మికులు సమస్యలు పరిష్కారం చేస్తుందా?" అంటూ ప్రశ్నించారు. దేశంలో ఇలాంటి సమస్యలుండగా మోడీ ప్రభుత్వ ప్రజలు దృష్టిని పక్కకు మళ్లించడానికి ఈఏడాది మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. యోగా ఒక్కటే సర్వరోగ నివారిణి అన్నట్లుగా ప్రచారం చేస్తోందని తెలిపారు. ఇదే తడవుగా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎద్దు ఈనిందంటే దూడను కళ్లంలో కట్టేయమన్నట్లుగా కేంద్రం ఇలా పిలుపునిచ్చిందో లేదో వెంటనే యోగాంధ్ర అంటూ ప్రకటించి మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని నెల రోజుల పాటు దీనిపై పెట్టిందని విమర్శించారు. వ్యాయామం పట్ల ప్రభుత్వానికి అంత చిత్తశుద్ధి ఉంటే పాఠశాలల్లో వ్యాయామం ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. అంతే తప్ప మోడీని ప్రసన్నం చేసుకోవడానికి చంద్రబాబు ప్రభుత్వం ఇలా వ్యవహరించడం సరికాదని హితవుపలికారు.

పిజిఆర్ఎస్‌కు 30 ఫిర్యాదులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 30 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, చీటింగ్ తదితర అంశాలు ఉన్నాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేపట్టి చట్టపరమైన పరిష్కారం అందించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఎస్సై డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, జిల్లా ఎక్సైజ్ అధికారి వి సుధీర్, జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-సబ్బవరం : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారిణి వి. శిరీష అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు న్యూస్ పేపర్ చదవడం, పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు రకరకాల కాగితాలతో మంచి ఆకృతులలో డిజైన్ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి మండల అధ్యక్షులు

బాబీ జన్మదిన వేడుకలు

బాబీని గజమాలతో సత్కరిస్తున్న పీలా గోవింద, రాంకీ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబీ) జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తుమ్మపాల శ్రీవేణుగోపాలస్వామి సామాజిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ హాజరై గజమాల, దుస్సాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాబి చేతుల మీదుగా కట్ చేసిన కేక్‌ను తినిపించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సురేంద్ర, ఏఎంసి చైర్మన్ పచ్చికూర రాము, పార్టీ నాయకులు కాయల మురళి, పీలా శ్రీకాంత్, చెక్కల శ్రీను, ఆడారి గోవిందరావు, కొణతాల రమణ బాబు, చదరం నాగేశ్వరరావు, దూలం గోపి, బొడ్డపాటి చిన్న రాజారావు, పల్లేల గణేష్, బొడ్డపాటి రామ్‌కుమార్, రాపేటి రామ్ కుమార్, నడిపల్లి బోసు బాబు, కర్రి జమి, కూటమి శ్రేణులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉపాధి హామీ కార్మికులకు బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాలను సోమవారం ఆయన సందర్శించి వారిలో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా 8 వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించలేదని వారు చెప్పారు. ఈ సందర్భంగా కూలీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు మంచినీరు, మజ్జిగ, పనిముట్లుకు డబ్బులు, వేసవి వేతనం వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పని దినాలు, రోజు కూలి రూ.600 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం రూ.307 వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, శ్రీనూకాంబిక ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను చేతుల మీదుగా సోమవారం అందజేశారు. భవిష్యత్తులో సమాజానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చే విధంగా ఉన్నతమైన విద్యను అభ్యసించి ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒరుగంటి నాగమణి, గంగుపాం నాగేశ్వరరావు, కాండ్రేగుల దుర్గాప్రసాద్, పివిఎన్ నాగజ్యోతి, పిఎంఎల్ నరసింహ మూర్తి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : రెండు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన జనసేన పార్టీకి చెందిన వారి కుటుంబాలకు జనసేన ప్రమాద బీమా ద్వారా మంజూరైన చెక్కులను మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చేతులు మీదుగా సోమవారం అందజేశారు. చోడవరం మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కోరుకొండ లక్ష్మి కొంత కాలం క్రితం కరెంటు షాక్ గురై మృతి చెందింది. ఈ మేరకు జనసేన పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.5 లక్షలు ప్రమాద బీమా చెక్‌ను ఎమ్మెల్సీ నాగబాబు మృతురాలి కుమారుడు కోరుకొండ అప్పల నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గూనూరు మూలునాయుడు, పట్టణ అధ్యక్షులు కర్రి రమేష్, గ్రామ పార్టీ కన్వీనర్ యేసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని పాటిపల్లి గ్రామ జనసేన కార్యకర్త కొయిలాడ మారుతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో జనసేన ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షల చెక్కును సోమవారం మారుతి అతను తల్లికి ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, పి.మూర్తి, డి.రామచంద్రరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని కుమారపురం గ్రామానికి చెందిన రైతు పల్లెల సూరిబాబు అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ సోమవారం సూరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సూరిబాబు మరణం కుటుంబానికి తీరని లోటని ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని అప్పారావు, బ్రాహ్మజీ కోరారు. సూరిబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎంపిపి గోవిందరావుకు పదవీ గండం?

- జనసేనలో చేరిన వైస్ ఎంపిపి-2 ఉమా
- ఇప్పటికే జనసేనతో అంటకాగుతున్న మరో ముగ్గురు

బోదెపు గోవిందరావు, రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు

ప్రజాశక్తి - యలమంచిలి

అవిశ్వాసం సెగ ఈ సారి మండల పరిషత్‌కు తాకే అవకాశం కనిపిస్తోంది. వైసిపికి చెందిన జంపపాలం ఎంపిటిసి, వైస్ ఎంపిపి-2 శిలపరశెట్టి ఉమా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో ఆదివారం పొద్దుపోయాక జనసేన కండువా కప్పుకోవడంతో మండల పరిషత్ సీన్ ఒక్కసారిగా మారిపోయింది. పూణెలో ఉన్న ఆమెను ఆగమేఘాల మీద రప్పించి జనసేన కండువా కప్పడం వెనుక ఎంపిపి బోదెపు గోవిందరావును పదవి నుండి దించేసే ఆలోచన ఉందని విశ్వసనీయంగా తెలిసింది.

మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ముఖ్య అనుచరుడైన బోదెపు గోవిందరావు మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిపై అవిశ్వాసం ప్రకటించడంలో కీలక పాత్ర పోషించారు. నాటి నుండి రాజకీయ సమీకరణాలు మారుతూ వస్తున్నాయి. ఎంపిపి పదవిపై ఆసక్తి పెంచుకున్న వైస్ ఎంపిపి-1, రేగుపాలెం ఎంపిటిసి రాజాన సూర్యచంద్రశేషగిరిరావు నాటి నుండి రాజకీయ పావులు కదిపారు. ఎమ్మెల్యే సుందరపు అనుమతి కోసం వేచి చూశారు. అటూ ఇటూ చూస్తూ డోలయమానంలో ఉన్న జంపపాలెం ఎంపిటిసి, మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు-2 శిలపరశెట్టి ఉమాను జనసేన వైపు తిప్పుకున్నారు.

యలమంచిలి మండల పరిషత్‌లో ఏడుగురు ఎంపీటీసీలు ఉండగా నాటి ఎన్నికల్లో ఏడుగురు వైసిపి నుంచే ఎన్నికయ్యారు. వీరిలో ఏటకొప్పాక -2 ఎంపిటిసి నగిరెడ్డి దేముడమ్మ మరణించారు. మిగిలిన ఆరుగురులో పులపర్తి ఎంపిటిసి బోదెపు గోవిందరావు (ఎంపిపి), బయ్యవరం ఎంపిటిసి పూటకూటి రామగణేష్ మాత్రమే వైసిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రేగుపాలెం ఎంపిటిసి (వైస్ ఎంపిపి-1) రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, ఏటికొప్పాక ఎంపిటిసి-1 నగిరెడ్డి అమ్మాజీ, కొత్తలి ఎంపిటిసి బర్రె శివలక్ష్మి వైసిపికి దూరంగా ఉంటూ జనసేన కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు స్తబ్ధతగా ఉన్న జంపపాలెం ఎంపిటిసి, వైస్ ఎంపిపి-2 శిలపరశెట్టి ఉమా ఆదివారం జనసేనలో చేరిపోయారు. కో-ఆప్షన్ సభ్యులు ఓటింగ్‌కు అనర్హులు. ఈ నేపథ్యంలో ఆరుగురు ఎంపిటిసిల్లో వైసిపిలో మిగిలింది ఇద్దరు మాత్రమే. దీంతో ప్రస్తుత ఎంపిపి గోవిందరావుకు పదవీ గండం తప్పేలా లేదని పరిశీలకులు భావిస్తున్నారు. వైస్ ఎంపిపి-1, రేగుపాలెం ఎంపిటిసి రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు పావులు కదిపి ఎమ్మెల్యే సందరపు విజయకుమార్, కూటమి ప్రభుత్వ మద్దతుతో ఎంపిపి పదవి కైవసం చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. అయితే సెప్టెంబర్ నాటికి ఎంపిపికి నాలుగేళ్లు పూర్తి కానుంది. దీంతో సెప్టెంబర్‌లో ప్రస్తుత ఎంపిపిపై అవిశ్వాస నోటీసు ఇవ్వనున్నారని విశ్వసనీయంగా తెలిసింది.

జెసిబి, ట్రాక్టర్ సహాయంతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

పూడిమడకలో పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో సోమవారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని రమణ ఆధ్వర్యంలో జెసిబి, ట్రాక్టర్ సహాయంతో రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించారు. ప్లాస్టిక్ సంచులు గుడ్డ పీలికలు వ్యర్థ పదార్థాలతో రహదారులకు అపరిశుభ్రంగా మారడంతో సర్పంచ్ స్పందించి శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దమదిన గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వియ్యపు నాయుడుకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. పక్కనున్న స్లాబ్ ఇల్లు తాలూకా విద్యుత్ సర్వీస్ వైర్ బాగా తుక్కుపట్టి ఉండడం వలన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో బట్టలు, ధాన్యం, వంటపాత్రలు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. మాజీ జడ్పీటీసీ వియ్యపు లక్ష్మి అప్పారావు జరిగిన ప్రమాదం విషయమై స్థానిక వీఆర్వోకి తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

డిసిసిబి చైర్మన్‌కు దుర్గాప్రసాద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సబ్బవరం : ఉమ్మడి విశాఖ జిల్లా డిసిసిబి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావును జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గండి దుర్గాప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొల్లి కృష్ణ, గండి కనకరాజు, పళ్ళ రమణ పలువురు యువకులు పాల్గొన్నారు.

4న కూటమి విజయం పండగ నిర్వహించాలి

ప్రజాశక్తి-యలమంచిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జూన్ 4వ తేదీన విజయం సాధించిన నేపథ్యంలో ఆ రోజు పండగ నిర్వహించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. యలమంచిలిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ల చీకటి పాలనపై గెలిచి ఏడాది కావస్తున్న సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ ఉదయం సంక్రాంతి, సాయంత్రం దీపావళి పండగలు చేసుకోవాని కోరారు.

సంచార వైద్య సేవల వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : ఏషియన్ పెయింట్స్ వారు సమకూర్చిన సంచార వైద్య సేవల వాహనాన్ని స్థానిక రాహుల్ కళ్యాణ మండపం వద్ద సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, ఏవి సత్యనారాయణ, మల్ల కాసేశ్వరరావు, వేగి కృష్ణ, ఆడారి శ్రీకాంత్, ఎం.ఆనంద్, సూరిశెట్టి అప్పలనాయుడు, తహశీల్దారు ఆదిమహేశ్వరరావు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పోలీసు స్టేషన్ పరిధిలోని అయితంపూడి గ్రామంలో ఇటీవల జరిగిన రెండు వరస దొంగతనాలు కేసులను బుచ్చయ్యపేట పోలీసులు ఛేదించారు. పోలీసులు కథనం ప్రకారం.... అయితంపూడి గ్రామానికి చెందిన ముచకర్ల బొర్రయ్య, పెదిరెడ్డి రాజు కుటుంబాలు బతుకు తెరువుకోసం పట్టణాలకు వలస వెళ్లారు. గ్రామంలో ఎవరూ చూడని సమయంలో అదే గ్రామానికి చెందిన ఇతరెడ్డి శివ కుమార్, ముచకర్ల కృష్ణమూర్తి అనే ఇద్దరు కలిసి బొర్రయ్య, రాజు ఇంట్లోని బీరువాల్లో దాచుకున్న బంగారు, వెండి, నగదును అపహరించుకుపోయారు. ఈ చోరీలపై ఫిర్యాదులు అందుకున్న బుచ్చయ్యపేట పోలీసులు విచారణ చేపట్టగా ఇతరెడ్డి శివ కుమార్, ముచకర్ల కృష్ణమూర్తి వ్యసనాలకు బానిసై కూలీలు ఇండ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి వారి నుండి మూడు తులాలు బంగారం, 10 తులాలు వెండి, 15వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసులను ఛేదించిన పోలీసులను సిఐ,డిఎస్‌పి అభినందించారు.

రేషన్ డిపోలో ఆకస్మిక తనిఖీలు

అదనపు నిల్వలు ఉండడంతో డీలర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి రేషన్ డిపోలో విజిలెన్స్ ఎస్ఐ కుమార్‌తో కూడిన బృందం సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డిపోలో నిల్వ ఉండాల్సిన సరుకులు కంటే 764 కేజీలు బియ్యం, 25 ప్యాకెట్లు పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ రేషన్ డిపో ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న కేఎం.పాలెం రేషన్ డీలర్ పి.నాగమణిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఉప తహశీల్దారు జి సాయిబాబా తెలిపారు. ఈ డిపో డీలర్ శంకర్రావుపై గతంలో 6ఎ కేసు నమోదు కావడంతో కెఎం.పాలెం డీలర్ నాగమణికి ఈ డిపో అదనపు బాధ్యతలు అప్పగించామని, ఆమె సైతం అక్రమాలకు పాల్పడడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మేరకు ఎ.కొత్తపల్లి డిపో ఇన్‌ఛార్జిగా చిన్ననందిపల్లి డీలర్ రొంగలి రామలక్ష్మిని, కేయం.పాలెం డిపో ఇన్చార్జిగా దేవరపల్లి-3 డీలర్ వెచ్చ జోగురాజుకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించి క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో సోమవారం "ఇంటెన్సిఫైడ్ టిబి క్యాంపెయిన్ - టీబీ ముక్త్ భారత్ అభియాన్-2025" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని "నిక్షయ్ మిత్ర"గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా జూన్ 4 నుండి గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నుండి జిల్లా స్థాయి వరకు టిబి వ్యాధికి ఎక్కువగా గురయ్యే జనాభాను గుర్తించి లక్షణాలు ఉన్నవాళ్ళందరికి నాట్ పరికరాలపై కళ్ళ పరీక్ష చేయడం, వ్యాధి లక్షణాలు లేని వ్యక్తులకు ఎక్స్ రే తీయడం జరుగుతుందని చెప్పారు. చివరిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర సమాచారంతో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డిస్ట్రిక్ట్ లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికే. బాలాజీ, డాక్టర్ సిహెచ్. ధాత్రి ప్రియ, వైద్య అధికారి డాక్టర్ ఎల్.శ్రావణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'టిడిపిలో కష్టపడే వారికి సముచిత స్థానం'

ప్రజాశక్తి-సబ్బవరం : టీడీపీలో పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం గుర్తింపు ఎల్లప్పుడు ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని పైడివాడ అగ్రహారం, సబ్బవరం గ్రామాలకు చెందిన ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ, పలువురు కార్యకర్తలు రాజీనామా చేసిన విషయాన్ని అయన తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శీరం అప్పలరాజును 2021లోనూ, అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు 2014లోనూ పైడివాడ అగ్రహారం ఎంపిటిసిలుగా టిడిపి గెలిపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కిల్లి వెంకట సత్యనారాయణ 2014, 2021 సంవత్సరాల్లో రెండుసార్లు సబ్బవరం ఎంపీటీసీగా టిడిపి తరఫున పోటీ చేశారని, యూనిట్ ఇన్చార్జిగా నియమించారని తెలిపారు. వైసిపి నుండి వచ్చిన రోమాల చంద్రశేఖర్‌కు నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి, సబ్బవరం మేజర్ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవి ఇవ్వడం జరిగిందన్నారు. అలాంటప్పుడు నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జి తమకు గుర్తింపు ఇవ్వలేదని ఆయనపై బురద జల్లడం సరికాదన్నారు. ఇప్పటికైనా వారు చర్చలకు వస్తే వారి సమస్యలను ఇన్చార్జి సమక్షంలో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి వెంకటరమణ, బొబ్బరి కన్నారావు, గొర్లి చైతన్య, కోరాడ శ్రీనివాసరావు, గండి దేముడు, బలిరెడ్డి అప్పారావు, పోతల కనకరాజు, పళ్ళ తాతారావు, లెక్కల అప్పలనాయుడు, రెడ్డి దేముడుబాబు, సబ్బవరపు సత్యనారాయణ, ఎం.అక్కుబాబు, ఆకులు గణేష్ పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ



నర్సీపట్నంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పరవాడ : ఈ నెల 4వ తేదీన వైసిపి చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను పరవాడ వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసిపి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు వైస్ ఎంపీపీలులు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, పార్టీ సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, కోటాన రాము, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : 'వెన్నుపోటు దినం' వాల్ పోస్టర్‌ను ఎంపిపి రెడ్డి జగన్మోహన్ సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, పార్టీ నాయకులు ఏటుకూరి రాజేష్, గొర్రెపోటు వెంకట్రావు, చీపురుపల్లి అచ్చిబాబు, ఏ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

మునగపాక : వెన్నుపోటు దినం నిరసనలను జయప్రదం చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో కలిసి సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కాండ్రేగుల నూకరాజు, ఆడారి త్రిమూర్తులు, కాండ్రేగుల జగన్, సుందరపు తాతాజీ, చదరం నాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, ప్రజలను మోసపుచ్చిన కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 4న నర్సీపట్నంలో వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటుదినం నిరసన చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. సోమవారం పెదబొడ్డేపల్లి క్యాంపు కార్యాలయంలో సంబంధిత పోస్టర్లను నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు, గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ పాల్గొన్నారు.

రావికమతం : ఈనెల 4న వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన జయప్రదం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తకోటలో పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్‌కంచిపాటి జగ్గరావు, డిసిసిబి పూర్వ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ గారు, ఉప సర్పంచ్ పందల దేవ, తలారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులో బొగవలి గోవింద్ ఆధ్వర్యాన వెన్నుపోటు దినం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి టిడిపి మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపంగి శ్రీనివాసు, సారిపిలి సంతోష్, పోతుబంతి హరి, బొమ్మాలి రవి, నూకరాజు, కొమ్ము నాగు, ముద్దాడ అశోక్ శేఖర్, సూరిబాబు గుమ్మడి గోపి, సిద్ధు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఊరికి.. వెలుగొచ్చింది!

కొత్తగా వచ్చిన విద్యుత్ వెలుగుల్లో సందడి చేస్తున్న జీలుగులోవ ఆదివాసీలు

- ఫలించిన సిపిఎం పోరాటం
- జీలుగులోవకు విద్యుత్ సౌకర్యం
- సంబరపడుతున్న ఆదివాసీలు
- థింసా నృత్యాలతో సందడి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

చీకట్లో మగ్గిన గిరిజనులు విద్యుత్ వెలుగులు చూసి మురిసిపోయారు. ఏడు కిలోమీటర్ల దూరంలోని బంగారుబందలు నడిచి వెళితేగానీ సెల్ ఛార్జింగ్ పెట్టుకోలేని వారంతా ఇపుడు తన ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకొనే సౌకర్యం కలగడంతో సంబరపడుతున్నారు. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని రావికమతం మండలం, చీమలపాడు పంచాయతీ సామలమ్మ కొండపైన జీలుగులోవలో పిటిజిలు ఎంతోకాలంగా నివసిస్తున్నారు. 50 మంది ఆదివాసీలున్న జీలుగులోవకు విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యం లేదు. కొండలను ఆనుకొని దట్టమైన అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న వీరు జంతు భయానికి రాత్రుల్లో కాగడాల వెలుగులో కాలం వెల్లదీస్తున్నారు.

జీలుగులోవలో తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సుదీర్ఘకాలంగా సిపిఎం నిర్వహించిన పోరాటంతో విద్యుత్ సౌకర్యం లభించింది. ఆదివారం జన్‌మన్ పథకం కింద ఆదివాసీల ఇళ్లకు విద్యుత్ మీటర్లు బిగించి, వీధుల్లో స్థంభాలు ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా కల్పించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఇన్నాళ్లు చీకటిలో కాలం గడుపుతున్న వారంతా విద్యుత్ వెలుగులు రావడంతో థింసా నృత్యంతో సంబరాలు చేసుకున్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటాల్లో భాగంగా జిల్లా పరిషత్ పాలకవర్గ సమావేశాల సందర్భంగా కాగడాలు పట్టుకొని ఆందోళన చేశారు. ఆదివాసీల ఆందోళన మీడియాలో రావడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. కమిషన్ ఛైర్మన్ ఆదేశాలతో అప్పటి కలెక్టర్ రవి పటాన్‌శెట్టి జీలుగులోవను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. జీలుగులోవలో సమస్యల పరిష్కారానికి తనతో వచ్చిన నర్సీపట్నం ఆర్డిఓ గోవిందరావు, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో ఆధార్, రేషన్ కార్డులు లేనివారికి మంజూరుచేశారు. ఇపుడు విద్యుత్ వెలుగులు ప్రసాదించారు. దీంతో సెల్ ఛార్జింగ్ పెట్టుకోవడానికి ఏడు కిలోమీటర్ల దూరంలోని బంగారుబంద వెళ్లాల్సిన దుస్థితి నుంచి విముక్తి కలిగిందనిజీలుగులోవకు చెందిన కొర్ర బాలరాజు, కొర్ర మహేష్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనుల పోరాటం ఫలించిందని ఆ పార్టీ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె. గోవిందరావు అన్నారు. ఇక జీలుగులోవ ఆదివాసీలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని, దానికోసం ఇక

రీసర్వే చేసి ఇళ్ల నష్ట పరిహారం చెల్లించాలి

టిడిపి నేత వెంకటేష్‌కు వినతిపత్రం ఇస్తున్న మూలపర్ర వాసులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం తొలగించనున్న ఇళ్లను రీ సర్వే చేసి న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. అమలాపురం పంచాయతీ సర్పంచ్ శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నరసింగరావు ఆధ్వర్యంలో నిర్వాసితులు సోమవారం తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. మూలపర్ర గ్రామంలో సర్వేనెంబర్ 383/5, రాస్తా సర్వేనెంబర్ 386/1లలో ఇళ్లకు నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు అంచనా విలువ సక్రమంగా రికార్డు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18ఏళ్లు నిండి వివాహమైన మహిళలు కూడా అయిన వర్తింపజేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యను హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని వెంకటేష్ హామీ ఇచ్చారు.

కలెక్టరేట్ వద్ద వర్మీ కంపోస్ట్ స్టాల్

ప్రజాశక్తి- రావికమతం: మండలంలోని గర్నికం గ్రామపంచాయతీ పరిధిలో తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్, వాటితో పండిస్తున్న పలు రకాల కాయకూరలు, పండ్లతో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇఒపిఆర్‌డి భానోజీరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిపిఒ శిరీషారాణి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలోనూ చెత్తతో సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టు, అలాగే గ్రామపంచాయతీ పరిధిలో ఖాళీ ప్రదేశాలలో కూరగాయలు, పండ్ల తోటలు పెంపకం వలన ఆయా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవడం శుభ పరిణామమన్నారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌లో వర్మీకంపోస్టుతోపాటు సేంద్రీయ ఎరువుతో పండించిన వంకాయలు, పచ్చిమిర్చి, ఇతర కూరగాయలు, బొప్పాయి, కొబ్బరికాయలు అమ్మకం చేశారు. ఈసందర్భంగా రూ.2305 ఆదాయం సమకూరిందని ఇఒపిఆర్‌డి భానోజీరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కె.అప్పలస్వామి, డిపిఆర్‌సి ఎఫ్‌టిసి దేవుడు బాబు, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

దళిత నేతపై దాడి బాధ్యులను శిక్షించాలి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : దళిత నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై దాడిని నిరసిస్తూ బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాలను కలుపుకొని అబీద్ సెంటర్లో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, ఈశ్వరరావుపై హత్యాయత్నం జరిగితే, పోలీసులు కేవలం అట్రాసిటీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఈశ్వరరావు భార్య మాట్లాడుతూ, తన భర్తకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వమే రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బొట్ట నాగరాజు రవి సిద్ధార్థ, సరమండ వీరబాబు, ఆరుగుల రాజబాబు, చిట్టయ్య సాల్మన్ రాజు, దేముడు, నాగేశ్వరరావు, సూరిబాబు, అప్పలనాయుడు, జిల్లు బాబు పాల్గొన్నారు

నిందితులందరినీ అరెస్ట్ చేయాలి : మాజీ ఎమ్మెల్యే

నర్సీపట్నంలో వైసిపి పట్టణ యూత్ ప్రెసిడెంట్ అల్లంపల్లి ఈశ్వరరావుపై పప్పల నాయుడు తోపాటు మరికొందరు దాడి ఘటనలో నిందితులందరినీ అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కోరారు. సోమవారం పట్టణ సి గోవిందరావును కలిసి మాట్లాడారు. ఈ ఘటనలో ఇద్దరినే అరెస్ట్ చేశారని, మిగిలిన వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అబీద్‌సెంటర్‌లో సిసి ఫుటేజీ ఆధారంగా అందరినీ అరెస్ట్ చేయాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, మాక్ రెడ్డి బుల్లిదొర ఉన్నారు

హామీల అమలుకు ఆందోళన

సాయి మెరైన్ రొయ్యల కంపెనీ ఎదుట గుడివాడ గ్రామస్తుల నిరసన

ఆందోళన చేస్తున్నగుడివాడ గ్రామస్తులు

ప్రజాశక్తి- యస్ రాయవరం.: మండలంలో గుడివాడ ప్రజలకు సాయి మెరైన్ రొయ్యల కంపెనీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం కంపెనీ వద్ద ఆ పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ గుడివాడ రెవెన్యూ పరిధిలో సాయి మెరైన్ ఎక్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ 2 కంపెనీ 2018లో నిర్మించారని, అప్పట్లో కంపెనీ నిర్మాణానికి గుడివాడ గ్రామపంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాల్లో ఏ ఒక్కటీ నేటికీ కంపెనీ యాజమాన్యం అమలు చేయలేదన్నారు. సరికదా కంపెనీ ఏర్పాటైన నాటి నుంచి పర్యావరణానికి నష్టం కలిగించేలాకంపెనీ యాజమాన్యం చర్యలు ఉన్నాయన్నారు. . కంపెనీ వ్యర్థ జలాలను విచ్చలవిడిగా వదిలేయడంతో చుట్టూ ఉన్న చెరువులు, పంట కాలువలు, పంట భూములలో నాశనమౌతున్నాయని, సుమారు 250 ఎకరాలు పంట భూములు బీడులుగా మారిపోయాయన్నారు. ,పశువుల సైతం నీరు తాగడానికి అవకాశాలను లేని పరిస్థితులు కల్పించారన్నారు. . కంపెనీ నుండి వస్తున్న వ్యర్థ జలాలు, వాయు కాలుష్యం వల్ల చుట్టూ ఉన్న గ్రామ ప్రజలు అనేక రకాల వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. 2018 మే 7న గ్రామపంచాయతీలో చేసిన తీర్మానం మేరకు గుడివాడ గ్రామపంచాయతీని దత్తత తీసుకున్న అభివృద్ధి చేయాలని, సిఎస్‌ఆర్ నిధులతో పనులు చేపట్టాలన్నారు. కంపెనీ వ్యర్థ ,రసాయన జలాలను బయటకు రాకుండా చూడాలని, వాయు, జల కాలుష్యం అరికట్టాలని కోరారు. కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని, సబ్సిడీ క్యాంటీన్, ప్రాథమిక వైద్యం కొరకు ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల కంపెనీలో మృతి చెందిన ఒడిశాఖు చెందిన హులక అనిత కుటుంబానికి రూ.2.50లక్షలు పరిహారమిచ్చి యాజమాన్యం చేతులు దులుపుకుందని, బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు, అనంతరంకంపెనీ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అయితే కంపెనీ ఛైర్మన్ స్థానికంగా అందుబాటులో లేరని, ఈనెల తొమ్మిదో తేదీన కంపెనీకి వస్తారని అపుడు చర్చించి సమస్యలు పరిష్కారం చేస్తామని ఎజిఎం హామీతో ఆందోళన విరమించారు..ఈ సందర్భంగా ఎస్.రాయవరం ఎస్ఐ. విభూషణ్ రావు బందోబస్తు ఏర్పాటు చేశారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, సిపిఎం మండల కార్యదర్శి ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు మాజీ ఎమ్మెల్యే మద్దతా?

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్‌కు మద్దతుగా నిలబడి, వారిని వెనకేసుకుని మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రెస్‌మీట్లు పెట్టడంపై 24వ వార్డు కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు ధ్వజమెత్తారు. దీన్ని బట్టి ప్రజలకు ఏం సంకేతమిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం నర్సీపట్నంలో టిడిపి నేతలు మీడియాతో మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం హయాంలోనే, గణేష్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఆ వ్యక్తిపై ఐదు కేసులు నమోదయ్యాయన్నారు. మహిళను మోసం చేయడం, చీటింగ్ కేసుల్లో నిందితుడి ఉన్న వ్యక్తిని పక్కనపెట్టుకుని ఈనెల 4న బైక్‌ర్యాలీ చేయాలనుకోవడం చోద్యమన్నారు. ర్యాలీలో పాల్గొనే వైసిపి శ్రేణులు ఆలోచించాలన్నారు. తాము 45ఏళ్లుగా టిడిపితోనే, అయ్యన్న వెంటే ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో రుత్తల కృష్ణ, లాలం మురళీకృష్ణ, కోరుప్రోలు శ్రీను, మార్కెట్ రాజా, రాజేశ్వరరావు, దాసు, శ్రీకాంత్, మర్ర అప్పలరాజు, రిషి ఉన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్‌పై వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలపై దృష్టి పెట్టాలని లైబ్రేరియన్ కోరారు.

జోగంపేట హైస్కూల్ హెచ్‌ఎంగా నాగభూషణం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జోగంపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వి.నాగభూషణం సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎఎల్ పురం హైస్కూల్ నుంచి నాగభూషణం బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం వి.సరోజిని నర్సీపట్నం మండలం చెట్టుపల్లి హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు.కొత్త హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలను ఇంకా ఉన్నత స్థితిలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు.. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని మూగజీవి విలవిల

రక్తపు మడుగులో ప్రమాదానికి గురైన ఆవు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక అబీద్ సెంటర్ జిసిసి పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం ఆవును గుర్తుతెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆవు ఆవు కాలుకు తీవ్ర గాయమై, రక్తస్రావంతో విలవిల్లాడిపోయింది. రక్తపు మడుగుల్లో కొట్టుమిట్టాడుతున్న ఆవును చూసి చలించిపోయిన స్థానికులు, దానికి ప్రథమ చికిత్స చేశారు. మూగజీవాల పెంపకందారులు వాటిని రోడ్డుపై వదిలేయడంతో నిత్యం రోడ్డుపైనే సంచరిస్తున్నాయని, వీటివల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తులు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్లపై మూగజీవాల సంచారాన్ని నియంత్రించడం ద్వారా ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్లపై ఆలనాపాలనా లేకుండా తిరుగుతున్న మూగజీవాలను గోకులానికి తరలిస్తే మంచిదని పలువురు అంటున్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి

ఎంపికైన అభ్యర్థులకు ఫోను ద్వారా సమాచారం

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు అర్హత సాధించిన వారికి ఫోను ద్వారా సమాచారం తెలియజేస్తామనిప్రిన్సిపల్ చరక వెంకటలక్ష్మి తెలిపారు. గతనెలలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను వెల్లడించారని, వాటిని కాలేజీలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రవేశపరీక్షలో అర్హతసాధించిన ఎంపికైన విద్యార్థులు అవసరమైన సంబంధిత ధ్రువీకరణలతో పాఠశాలకు వచ్చి ప్రవేశాన్ని కన్ఫర్మ్ చేసుకోవాలని సూఇచంచారు. రోస్టర్ కం మెరిట్ లిస్ట్ ఆధారంగా ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులకు ఫోన్ ద్వారా కూడా సమాచారం తెలియజేస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు

ప్రపంచ సైకిల్ దినోత్సవ శుభాకాంక్షలు
ప్రో॥ పి.వి.సత్యన్నారాయణ
శ్రీ గౌరీపరమేశ్వరి సైకిల్ & జనరల్ స్టోర్స్
ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర, నర్సీపట్నం. సెల్: 9291258583
ప్రో॥ ఎస్.రాముునాయుడు ఎస్.వి.ఎస్. సైకిల్ జోన్
Near Peter England Showroom,
రామారావుపేట నర్సీపట్నం. సెల్: 9247169090
ప్రో॥ ఎస్.వి.ఎస్.ఎన్.ఎం.నాయుడు
శ్రీ వెంకటసాయి సైకిల్ & జనరల్ స్టోర్స్
పాల్‌ఘాట్ సెంటర్, నర్సీపట్నం. సెల్: 9248409380

June 3rd WORLD CYCLE DAY GREETINGS
శ్రీనివాస సైకిల్ & జనరల్ స్టోర్స్
మధురవాడ, విశాఖపట్నం.
సెల్: 9949482469, ఫోన్: 08912736546
Rajadhani Enterprises
CYCLE ZONE
Opp. Madhuruwada SBI Bank, Beside
Bata Showroom, Market Road, VSP
Cell : 62810 71080, 62810 33480

వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతరమహోత్సవ ప్రత్యేకం

నేడు మోదమ్మ జాతరకు వేళాయె!

- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ
- విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా మాడుగుల
- 150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- గ్రామంలో ఇంటింటా పండుగ శోభ

పండుగ సందర్భంగా మాడుగులలో ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్లు

విద్యుద్దీప కాంతులతో మోదకొండమ్మ ఆలయం

ప్రజాశక్తి- మాడుగుల : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ జాతర ఈనెల 3న మంగళవారం నిర్వహణకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. అమ్మవారిని అంగరంగ వైభవంగా అలంకరించడంతోపాటు పండుగ సందర్భంగా గ్రామమంతా విద్యుద్దీపాలంకరణతో వెలిగిపోతోంది. గ్రామంలో భారీ విద్యుత్ కటౌట్లు, సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామంలో భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేశారు. జాతర రోజున మంగళవారం వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక్ష పూజలు, అభిషేకాలు, మొక్కులు తీర్చుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ, ఉత్సవ కమిటీలతోపాటు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మండుటెండలను దష్టిలో ఉంచుకొని ఆలయం ముందు భాగంలో టెంట్లు ఏర్పాట్లు చేశారు. సాధారణ, ప్రత్యేక దర్శనానికి క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు దారిపొడుగున దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలు, ప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాట్లా డుతూ గతం కన్నా ఈ ఏడాది భారీగా భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశామని, రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే గ్రామంలోని అన్ని ఇళ్లలో బంధుమిత్రులతో పండుగ సందడి నెలకొంది.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ప్రశాంతంగా పండుగ నిర్వహణకు పటిష్టభద్రత

మోదమ్మ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముగ్గురు సిఐలు, పదిమంది ఎస్ఐలు, 150మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఘాట్‌రోడ్డు మీదుగా వచ్చే వాహనాలను వెంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా, ఎం.కోడూరు మీదుగా వచ్చే వాహనాలను ఆలయ వెనుకభాగం నుంచి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాలతో విఐపిల దర్శనం అనంతరం బస్‌స్టాండ్ మీదుగా కాకుండా, ఎంకోడూరు మీదుగా పంపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సిసి కెమెరాల నిఘా పెట్టినట్లు తెలిపారు.

ఏటా జూన్‌లో మోదమ్మ జాతర

ఏటా జూన్ మొదటివారంలో మాడుగుల మోదమ్మ జాతరను ఆనవాయితీగా నిర్వహిస్తారు. జాతరకు నెలరోజుల ముందు అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలను అమ్మవారి ఆలయం నుంచి స్థానిక శతకంపట్టువద్దకు మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కొలువు ఉంచుతారు. నెలరోజులూ అక్కడ నిత్యపూజలు నిర్వహించి, అనంతరం జాతర రోజున సాయంత్రం శతకంపట్టు వద్ద కొలువుతీరిన అమ్మవారి విగ్రహాలు, పాదాలు, ఘటాలను ఊరేగింపుగా తిరిగి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి, ప్రత్యేకపూజలు, అభిషేకాలు, పండుగలతో మొక్కులు తీర్చు కుంటారు. మోదమ్మ జాతరకు స్థానికులే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజల్లో పాల్గొంటారు. వివాహాది శుభకార్యాలు చేసిన అనంతరం అమ్మవారికి ఘటాలిచ్చి మొక్కులు చెల్లించుకొంటారు.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ఎం.ఎల్లారావు B.A., LLB., అడ్వకేట్, నోటరీ 9494243340
ఎం.మోహన్‌పాత్రుడు MCA, LLB. అడ్వకేట్, నోటరీ 9885335668
ఎమ్మార్వో ఆఫీస్ ప్రక్కన, వి.మాడుగుల
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రో॥ బవిరిశెట్టి వెంకట్రావు సన్స్
బి.వి.ఆర్. కిరణా & జనరల్ స్టోర్
మెయిన్‌రోడ్, వి.మాడుగుల
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ఎన్.నాగశంకర్
మెయిన్‌రోడ్, వి.మాడుగుల
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ పండుగకు విచ్చేయుచున్న అశేష ప్రజలకు, నాయకులకు, అధికారులకు, మిత్రులకు, భక్తులకు, శ్రేయోభిలాషులకు అమ్మవారి కరుణ కటాక్షములు కలగాలని కోరుకుంటూ...
మాజీ సర్పంచ్ స్వర్గీయ మండల జయశ్యామలరావుగారు కుమారుడు - కోడలు
మండల వాసు సాహితి టర్మరిక్ పాలిసింగ్ అండ్ అగ్రో ప్రాసెసింగ్ యూనిట్ సెల్: 9490389996, 9885207996
మండల సంతోషి సుబ్బలక్ష్మి (సునీత) బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
వి.మాడుగుల గ్రామం, వి.మాడుగుల మండలం అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదమాంబ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రో॥ పుట్టాగిరి బ్రదర్స్
ఎస్.ఆర్.కె. కిరణా & జనరల్ స్టోర్
మెయిన్‌రోడ్, వి.మాడుగుల
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీనాధు ప్రసాదరావు B.Com., B.L. అడ్వకేట్, సెల్: 9441586716
శ్రీనాధు ప్రమోద్‌కుమార్ B.A.LLB అడ్వకేట్, సెల్: 8333883754, 6304299115
వి.మాడుగుల గ్రామం
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగుల శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
దంగేటి సూర్యారావు మాజీ సర్పంచ్, వి.మాడుగుల పంచాయితీ
మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యులు
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
శ్రీ మోదకొండమ్మ తల్లి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ పొలిమేర విజయలక్ష్మి-చిన్నారావు
వి.మాడుగుల ఎం.పి.టి.సి.-1 వైస్ ఎం.పి.పి.
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ శుభాకాంక్షలు
వి.మాడుగులలో కొలువైన శ్రీ మోదకొండమ్మ వారి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హార్దిక శుభాకాంక్షలు
కె.మూర్తిబాబు (ఇ.ఒ)
పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
వి.మాడుగుల గ్రామపంచాయతీ
సెల్: 9398748392
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.